క్లుప్తంగా

కాంగ్రెస్ ఎంపీ టికెట్‌కు దరఖాస్తు



సంగెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుండేటి రాజారాం ఆ పార్టీ నుంచి ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. తనకు అధిష్టానం టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌కో ఏఈకి సన్మానం



దుగ్గొండి : మండలంలోని రేకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఏఈగా పని చేసిన సురేశ్‌కుమార్ బదిలీ కాగా ఆయన్ను ఏడీ లక్ష్మణ్, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సభలో ఏడీ మాట్లాడారు. ఏఈగా సురేశ్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్ పాషా, రాజు, జెరిమ్, అజయ్, ఖాజా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌కు ప్రింటర్ బహూకరణ



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు గెజిటెడ్ హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి డీఈఓ వాసంతి చేతుల మీదుగా ప్రింటర్‌ను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయ మాట్లాడారు. పాఠశాలలో ఎఫ్‌ఏసీ హెచ్‌ఎంగా పని చేసి ఉద్యోగోన్నతిపై భూపాలపల్లి జిల్లా కాటారంలోని హైస్కూల్‌కు హెచ్‌ఎంగా బదిలీ అయిన ఉమారాణి ఆమె తల్లి సంధ్యావళి స్మారకంగా రూ.21 వేల విలువైన ప్రింటర్‌ను బహూకరించడం అభినందనీయమని తెలిపారు.

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జన్మదిన వేడుక



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు మహమూద్, నాయకులు మచ్చ రమేశ్, కుంట రమేశ్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ డీఈ నియామకంపై విచారణ చేపట్టాలి

నల్లబెల్లి : ఐటీడీఏలో డీఈ నియామకంపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ ప్రవీణ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని బిల్‌నాయక్‌తండాలో శనివారం ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత లేని అధికారిని డీఈగా నియమించారని తెలిపారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో అర్హులైన గిరిజన ఇంజనీరింగ్ అధికారులు ఉన్నప్పటికీ అర్హత లేని అధికారిని డీఈగా ఎలా నియమిస్తామరని ప్రశ్నించారు. అర్హత లేని అధికారి పర్యవేక్షణ వల్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాకేశ్ నాయక్, మహేందర్, గణేశ్ పాల్గొన్నారు.

'బహుజనులకు అండగా బీఎస్పీ'

గూడూరు: బహుజనులకు బీఎస్పీ అండగా ఉంటుందని పార్టీ కార్యదర్శి, జోన్ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ అన్నారు. మండలంలోని నాయకపల్లిలో పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సువర్ణపుర రజిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వారి వెంట జిల్లా ఇన్‌చార్జ్ దార ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు ఈసంపల్లి ఉపేందర్, దయానంద్, శ్రీను, భిక్షం ఉన్నారు.

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి

● మాజీ పాలకవర్గానికి సన్మానం

నల్లబెల్లి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తే గ్రామాలు సమగ్రాభివృద్ధి సాధిస్తాయని స్పెషల్ ఆఫీసర్ ప్రభావతి తెలిపారు. మండలంలోని బజ్జుతండా గ్రామ పంచాయతీ తాజా మాజీ పాలకవర్గాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ప్రభావతి మాట్లాడారు. ఇప్పటివరకు పంచాయతీ పాలకవర్గాలు అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. గ్రామాల అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లోనూ పల్లెల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాటోత్ పద్మ తిరుపతి, ఉపసర్పంచ్ లత, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు వీరమ్మ, నీలమ్మ, తేజావత్ బాలమ్మ, బుంగాలి, రాంసింగ్, అంగన్‌వాడీ టీచర్ హేమలత, ఎస్‌ఎస్‌ఎం సుమలత, తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : మాజీ సర్పంచ్ పద్మ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో తాజా మాజీ పంచాయతీ పాలకవర్గాన్ని స్పెషల్ ఆఫీసర్ సునీల్ కుమార్ రాజ్, ఎంపీఓ, తదితరులు శాలువాలు కప్పి మెమోంటోలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ సునీల్‌కుమార్ మాట్లాడారు. గ్రామ అభివృద్ధిలో తాజా మాజీ పంచాయతీ పాలకవర్గ భాగస్వామ్యం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : ముగ్దుంపురం మాజీ పాలకవర్గంతో అధికారులు

శాస్త్రీయ దృక్పథంతో ఉన్నతి

నర్సంపేట రూరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నతి సాధిస్తారని ప్రముఖ విద్యావేత్త మోతె సమ్మిరెడ్డి కోరారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని శివానీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని చెప్పారు. సైన్స్ పరిశోధన ఫలితాలు సామాన్య ప్రజానీకానికి చేరువకావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరిశోధనలు, ప్రయోగాలు చేస్తూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎం.జయుడు, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ట్రస్మా నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు పాచికంటి రమేశ్, గోక లీలావతి ట్రస్ట్ చైర్మన్ గోక రామస్వామి, గోక వినోద్, మోతె ఇంద్రసేనారెడ్డి, సుధాకర్, సురేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మిరెడ్డి

కార్మిక చట్టాల సవరణ సరికాదు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణ, కార్మికులు

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ

నెక్కొండ : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడం సరికాదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ తెలిపారు. కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 8న తలపెట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చలో రాజ్‌భవన్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్ (మాస), ఐఎఫ్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికుల హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పోరాడతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా 44 కార్మిక ప్రయోజనకర చట్టాలను కాలరాసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ కాకుండా కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్ విధానాలు అమలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామీణ కార్మికులకు ఏడాది పొడవునా పని, సామాజిక భద్రత, గౌరవప్రదమైన వేతనాలు కల్పించడంతోపాటు కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మందాటి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు బాలరాజు, నాగెల్లి శ్రీనివాస్, మండి వెంకట్, తోట రాజేశ్, మాదుగుల చంద్రమౌళి, ఉరుసు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు, ప్రజా వ్యతిరేకం



వర్ధన్నపేట: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, ప్రజావ్యతిరేకమని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాసు కుమార్ దుయ్యబట్టారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత పది వార్షిక బడ్జెట్లను పరిశీలిస్తే ప్రాధాన్యత రంగాలకు కోత విధించిదని తెలిపారు. 12.5 కోట్ల రైతు కుటుంబాలకు పీఎం కిసాన్ ద్వారా సాయం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం రూ.75 వేల కోట్లు అవసరం ఉండగా రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి పూర్తిగా ఖర్చు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రైతులకు అందించే ఎరువుల సబ్సిడీని 13.2 శాతం తగ్గించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. నాయకులు భద్రయ్య, సురేశ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

● సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం జరిగిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. వ్యవసాయ రంగానికి 2024–25 వార్షిక కేంద్ర బడ్జెట్‌లో రూ.2,22,281 కోట్లు కేటాయించినట్లు ప్రకటించినా వాస్తవంగా రూ.1,17,528.79 కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తూ, మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ఆర్థిక మంత్రి ఉపన్యాసంలో ఊదరగొట్టినా బడ్జెట్‌లో అందుకు సంబంధించిన కేటాయింపులు చేయకపోగా కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేలా వ్యవహరించిందని విమర్శించారు. దేశం బాగుకు పేదలు, యువకులు, మహిళలు, రైతులు మాత్రమే కీలకమని చెపుతూ రైతులకు అనేక లాభాలు, రాయితీలు కల్పించినట్లు బడ్జెట్‌లో నమ్మబలికారని ధ్వజమెత్తారు. దేశాన్ని వ్యవసాయ దిగుమతులకు కేంద్రంగా తయారు చేస్తూ వ్యవసాయోత్పత్తులపై కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం కొనసాగేలా నిధులు తగ్గిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఉపసంహరించుకున్న మూడు నష్టదాయక చట్టాలను మరో కోణంలో అమలు చేయడాన్ని ఖండించారు. తక్షణమే రుణాలు మాఫీ చేయడంతోపాటు కనీస మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి, నాయకులు అక్కపెల్లి సుధాకర్, గొర్రె సంజీవ, గట్ల నర్సింహరాములు పాల్గొన్నారు.

వసతుల్లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : సరైన వసతుల్లేని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు కొమ్ముక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేందర్, సందీప్, రవి మాట్లాడారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సరైన వసతుల్లేవని, భారీగా డబ్బు దండుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచారణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్, నాయకులు వెంకటేశ్, ప్రశాంత్, పీవైఎల్ నాయకులు రాజు, రమేశ్, చందు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : మట్టి అక్రమ తరలింపుపై ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్పీ) జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఏనుగల్ శివారు మాల్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయ పక్కనున్న గుట్ట మట్టిని కొందరు నెల రోజులుగా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. హిటాచీ టిప్పర్‌ల ద్వారా కోట్లాది రూపాయల విలువైన మట్టిని వరంగల్, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గుట్టల తవ్వకంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. విచారణ చేపట్టి అక్రమార్కులపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

గీసుకొండ : మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. దొమ్మరివాడలోని పాకనాటి స్వప్నకు చెందిన బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ చేసిన రూ.12,360 విలువైన పలు రకాల బీర్లు, విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న మద్యంను తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి.బాబులాల్, ఎస్సై నర్సింహరావు, సివిల్ ఎస్సై శ్వేత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న అనంతుల రమేశ్

● మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నర్సంపేట రూరల్ : గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని సర్వాపురం వివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గోపగాని వెంకట్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం గీత కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని చెప్పారు. కుల వృత్తిలో ప్రమాదాలు నివారించడానికి రక్షిత మోకు, మోపెడ్‌లు అందించాల్సి ఉందన్నారు. జనగామ జిల్లాకు సర్వార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని, ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి పడి మృతి చెందిన, గాయపడిన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు కొండి రాము, వెంకట్, గొడిశాల సదానందం, మద్దెల సాంబయ్య, శీలం వీరన్న, సంతోశ్, మల్లేశ్, జూలూరి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సుదర్శన్, తదితరులు

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం కార్యదర్శి, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు, తెలంగాణ స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు, ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ చేతుల మీదుగా రోగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, ఏఎస్‌ఆర్ సేవా సంస్థ ప్రతినిధి ఎర్రబోయిన రాజశేఖర్, కన్స్యూమర్ ఫోరమ్ ప్రతినిధి నాగెల్లి సారంగంగౌడ్, వాలంటీర్ మొగిలిచర్ల రాము సేవక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన యువతికి అభినందనలు

సంగెం : ఇటీవల వెలువడిన ఫలితాల్లో స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన మండల కేంద్రానికి చెందిన గూడెల్లి నవ్యను గ్రామస్తులు అభినందించారు. గూడెల్లి సుజాత–సుధాకర్ దంపతులు చిన్న కిరాణం, టైలరింగ్ చేసుకుంటూ చదివించగా నవ్య స్టాఫ్ నర్స్ ఉద్యోగం సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ నుంచి నవ్య నియామక పత్రం అందుకున్న క్రమంలో గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆమెకు అభినందనలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతగిరి రవి కోరారు. పట్టణంలోని ఆ సంఘ కార్యాలయంలో భవన నిర్మాణ తాపీ వర్కర్ల సంఘం అధ్యేఉడు రుద్రారపు పైడయ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యనిర్వహణ కమిటీని సభ్యులు సామల స్వామి, లక్క నరేందర్ అధ్యక్షతన శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లక్క నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనంతగిరి రవి, ఉపాధ్యక్షులుగా ఓదెల చంద్రయ్య, దేవండ్ల రాంబాబు, కానుగంటి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా గోనెల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా అడప వేణుగోపాల్, నెలకంటి కుమారస్వామి, పెలిచేరి గోపీ, కోశాధికారిగా కందికొండ రాజు ఎన్నికయ్యారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ రవి మాట్లాడారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తొలుత భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాలకుర్తి మధు, యాకయ్య, వీరెల్లి అశోక్, తదతరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న పైడయ్య

జీఓ నంబర్ 342 పునరుద్ధరించాలి



పర్వతగిరి : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పర్వతగిరి : జీఓ నంబర్ 342ను పునరుద్ధరించడంతోపాటు జీఓ నంబర్ 2ను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీలను ఓపెన్ సీనియారిటీలో కూడా తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్కాల పరశురామ్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆ సంఘం క్యాలెండర్‌ను ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని, జీఓ నంబర్ 317 బాధితులకు సత్వర న్యాయం చేసి ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి కార్యక్రమాలను సమీక్షించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూక్య హరిలాల్, పుల్ల అనిల్‌కుమార్, పాక రమేశ్, శ్రీధర్, అశోక్, ఉమాదేవి, రాధాకృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.



సంగెంలో..

క్యాలెండర్ ఆవిష్కరణ

సంగెం : మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ కళావతి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పద్మశాలీ ఉద్యోగ సంఘం నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఐబీ ఏఈలు సాయిరాజ్, రోహిణి, జేఈ గణేశ్, సీనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు అనూష, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాల గ్రామంలోని స్మశాన వాటికలో బోర్ వెల్ ఏర్పాటు పనులను బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ నిధుల నుంచి స్మశాన వాటికలో బోర్ మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, గొడిశాల సదానందం, బండారి రమేశ్, న్యాయవాది మోటూరి రవి, రాజమల్లు, చిన్నపెల్లి నర్సింగం, గద్దం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడిగేదెలకు వేలం

తొర్రూరు రూరల్: తొర్రూరు మండలంలోని హరిపిరాల గ్రామానికి వచ్చి చిక్కిపోయిన రెండు పాడిగేదెలను వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దేవయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులకు క్రితం గ్రామ శివారులోకి రెండు గేదెలు వచ్చి పంట పొలాలను మేస్తుండగా సంబంధిత రైతులు పట్టుకోని గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించగా, ఇప్పటికి గేదెల ఆచూకీ కోసం ఎవ్వరు కూడా రాకపోవడంతో వేలం వేస్తున్నట్లు చెప్పారు. అవసరం ఉన్న రైతులు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఆర్డీఓ విచారణ

గూడూరు: మండల కేంద్రంలోని చంద్రుగూడెం సమీపంలోని అసైన్డ్ భూమిలో చేపట్టిన ప్రభుత్వ ఏకలవ్య పాఠశాల పనులను భూమి కోల్పోయిన బాధిత రైతులు శుక్రవారం అడ్డుకోగా ఆర్డీఓ మంగమ్మ శనివారం అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. పనులను అడ్డుకున్న బాధిత రైతులతో మాట్లాడారు. సమస్య గురించి అడిగి తెలుసుకన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా చేపట్టిన పనులను అడ్డుకోవద్దని రైతులకు చెప్పారు. సమస్యను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలని స్పష్టం చేశారు. తాను విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. తొలుత బాధిత రైతులు ఆర్డీఓతో గోడు వెళ్లబోసుకున్నారు. సుమారు 60 ఏళ్లుగా సదరు భూమిలో సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇపుడు ప్రభుత్వ భూమి అని పాఠశాల నిర్మాణం చేపడితే తమ కుటుంబాలు నష్టపోయి రోడ్డున పడాల్సి వస్తుందని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, డీటీ కోమల, అధికారులు పాల్గొన్నారు.

యువకుల చొరవ.. రోడ్డుకు మరమ్మతు

వర్ధన్నపేట : పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి నుంచి రాజస్తాన్ వీధికి వెళ్లే సీసీ రోడ్డుకు యువకులు చొరవ తీసుకుని మరమ్మతు చేశారు. ఆ రోడ్డు గుంతలయమై, మట్టి ఉండడంతో ఏడాదిగా వాహనచోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు. మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. రోడ్డుకు మరమ్మతులు చేయించలేదు. దీంతో ఆ కాలనీ యువకులు దాతల సహకారంతో రూ.30 వేల వ్యయంతో సీసీ రోడ్డుకు మరమ్మతు చేశారు.



సీసీ రోడ్డుకు మరమ్మతు చేస్తున్న యువకులు